క్లుప్తంగా

ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన సైకిల్ మెకానిక్, రంగస్థల నటుడి కుటుంబానికి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. స్థానిక ఇందిరానగర్ బీసీ కాలనీకి చెందిన ఏనుగుల శ్రీరామ్మూర్తి (75) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో దహన సంస్కారాలు నిర్వహించేందుకు స్తోమత లేకపోవటంతో, కుటుంబ సభ్యుల ఇబ్బంది తెలుసుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని మాజీ ఉప సర్పంచ్ కాకాని బాబు, పంచాయతీ వార్డు సభ్యులు కడవకొల్లు నాగరాజు, జోగి రామస్వామి, మేకల మరియమ్మ చేతుల మీదగా మృతుని కుటుంబానికి అందించారు.

వణుకూరులో జోరుగా పేకాట

పెనమలూరు: వణుకూరు ప్రాంతంలో జోరుగా పేకాట ఆడుతున్నారు. గ్రామస్తులు తెలుపుతున్న వివరాల ప్రకారం.. గతంలో ఇక్కడ పేకాట నిర్వహించి పోలీసులకు దొరికిన వ్యక్తే మరలా పేకాట ఆడిస్తున్నారని చెబుతున్నారు. వణుకూరు-గొడవర్రు శివారు ,గ్రామంలో శ్మశానవాటిక రోడ్డులో గత కొద్ది కాలంగా పేకాట జోరుగా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పేకాట శిబిరం వలన శాంతిభద్రతలకు భంగం వాటిల్లే పరిస్థితి ఉందని వాపోతున్నారు. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టపగలే రెండు దుకాణాల్లో చోరీ

పెనమలూరు: పోరంకిలో దొంగల కన్నుగప్పి చోరీకి పాల్పడటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి మోడల్ డైరీ వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి లస్సీ కావాలన్నారు. వచ్చిన వారికి లస్సీ ఇస్తుండగా వారు కన్నుగప్పి క్యాష్ కౌంటర్‌లో రూ.10 వేలు చోరీ చేశారు. పక్కనే ఉన్న పాండురంగా మెడికల్ షాపు వద్దకు వెళ్లి మందులు కావాలని, కళ్లు గప్పి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.8500 చోరీ చేసి చల్లగా జారుకున్నారు. పట్టపగలే కస్టమర్లుగా వచ్చి చోరీలకు పాల్పడటంతో దుకాణాల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనఖీ చేస్తుండగా కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామానికి చెందిన కొప్పరాజు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై 120 కేజీల రేషన్‌బియ్యాని తరలిస్తూ పట్టుబడ్డాడు. రేషన్ తీసుకున్న లబ్ధిదారుల నుంచి కేజీ రూ.13 వంతున కొనుగోలు చేసి అధిక ధరలకు బియ్యం విక్రయిస్తానని పోలీసులకు తెలిపాడు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

బాలుడిపై అసభ్య ప్రవర్తన.. పోలీసులకు ఫిర్యాదు

గన్నవరం: ఓ బాలుడి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై ఆదివారం పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం..మండలంలోని గొల్లనపల్లికి చెందిన పినాకపాణి అనే యువకుడు ఆతడి ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలుడికి సెల్‌ఫోన్ ఇస్తానని పిలిచాడు. దగ్గరకు వచ్చిన బాలుడు సెల్‌ఫోన్ తీసుకుని ఆడుకుంటున్న సమయంలో యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. యువకుడి ప్రవర్తనతో భయపడిన బాలుడు ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో ఆ బాలుడు తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేటి నుంచి తపాలా వారోత్సవాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పోస్టల్ డివిజన్‌లో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కె. ఆదినారాయణ, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ టి.నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 150 ఏళ్ల పోస్టల్ సేవలను గుర్తు చేస్తూ డివిజన్‌లో ఐదు రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 7వ తేదీ సోమవారం మెయిల్స్, పార్సిల్ దినోత్సవం, 8న ఫిలాటెలీ దినోత్సవం, 9న ప్రపంచ తపాలా దినోత్సవం, 10న అంత్యోదయ దివస్, 11న విత్తియ శశక్తికరణ్ దివస్ కార్యక్రమాలుంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయా దివస్‌లపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

220 మందికి వైద్యసేవలు

మచిలీపట్నంటౌన్: స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, ప్రజారోగ్య వేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ నేతృత్వంలో వైద్య బృందం రోగులకు వైద్యసేవలు అందించారు. పలు వ్యాధులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ. 200కే నెలకు సరిపడా మందులను అందజేశారు. మొత్తం 220 మంది వైద్య సేవలు పొందారు.

నష్టం కొండంత.. పరిహారం గోరంత

- రూ.10 వేల పరిహారంపై అన్నదాతల ఆందోళన
- అరకొరగా పంట నష్టం అంచనా నమోదు
- కౌలురైతులకు దక్కని పరిహారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆపదకాలంలో వరద బాధితులను తగిన నష్టపరిహారంతో ప్రభుత్వం ఆదుకోవాలి. అయితే ప్రభుత్వం అరకొరగా పరిహారం విదిల్చటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నష్టపరిహారం చెల్లింపు కోసం ప్రభుత్వం ప్రకటించిన నిబంధనలు కౌలురైతులకు ప్రతిబంధకాలుగా మారాయి.


బాపులపాడు మండలం ఆరుగొలనులో ముంపునకు గురైన వరి (ఫైల్)

ఏడు వేల ఎకరాల్లో నష్టం జరిగితే..

బుడమేరు వరద కారణంగా బాపులపాడు మండలంలో ఆరుగొలను, ఓగిరాల, రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం, వైకుంఠ లక్ష్మీపురం, కాకులపాడు గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. మెట్ట ప్రాంతంలో మల్లవల్లి, రంగన్నగూడెం, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాల్లో అధిక వర్షాలతో కూరగాయలు, మినుము పంటలు నష్టపోయారు. అయితే వ్యవసాయ అధికారుల నివేదిక మేరకు 708 మంది రైతులు 1070.31 ఎకరాల్లో సాగు చేసిన మినుము పంటకు నష్టం కలిగింది. మరో 2031 మంది రైతులు 3499.22 ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కానీ వాస్తవానికి మండలంలో సుమారు ఏడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా రైతు సంఘాలు చెబుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు కేవలం 33 శాతం కంటే అధికంగా పంట నష్టపోయిన రైతులకు మాత్రమే పరిహారం మంజూరు చేయటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అరకొర పరిహారం..

కృష్ణా-ఏలూరు కాలువ ద్వారా డెల్టా ప్రాంతంలో వరి సాగు చేసే రైతాంగం ఆగస్టు నెలాఖరు నాటికి దాదాపుగా కలుపుతీత, ఎరువులు చల్లటం వరకూ వ్యవసాయ పనులు పూర్తి చేశారు. అప్పటికి రూ.25 వేల వరకు పెట్టుబడి అయింది. కానీ ప్రభుత్వం వరి పంటకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వరి పంట దాదాపు 15 రోజుల పాటు పూర్తిగా వరద నీటిలో నాని కుళ్లిపోయింది. దీంతో మరొక పంట సాగుకు మళ్లీ పెట్టుబడి కావాల్సి ఉంది. ప్రభుత్వం కంటితుడుపుగా పంట నష్టపరిహారం ప్రకటించటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీనికి తోడు 33 శాతం పైబడి పంట నష్టం జరిగినప్పటికీ పలుచోట్ల అధికారులు తక్కువగా నమోదు చేయటంతో పరిహారం అందని పరిస్థితి ఏర్పడింది.

కౌలురైతులకు మొండిచేయి..

బాపులపాడు మండలంలో పంట నష్టం జరిగిన ఆయా గ్రామాల్లో దాదాపు 1500 మంది కౌలురైతులు ఉన్నారు. కానీ ప్రభుత్వం పంట నష్టపరిహారం పంపిణీలో కౌలురైతులను పరిగణలోకి తీసుకోలేదు. వీరంతా వరిసాగుకు అప్పులు తెచ్చి ఎకరాకు కనీసంగా రూ.25 వేలు వరకు ఖర్చు పెట్టారు. గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ పంట నష్ట పరిహారం దక్కని పరిస్థితి. అధికారులు ఈ-క్రాప్


దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

యాప్‌లో నమోదు చేసిన వ్యక్తులు లేదా భూయాజమానుల పేరిట పంట నష్టపరిహారం చెల్లిస్తామని పేర్కొన్నారు. కానీ వరదలు వచ్చే నాటికి చాలా గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి కాకపోవటంతో కౌలురైతుల పేర్లు రికార్డులోకి చేరలేదు.

ఐదు ఎకరాల్లో సాగు చేస్తే..



బాపులపాడు మండలం మల్లవల్లిలో ఐదు ఎకరాల్లో మినుము పంటను సాగు చేశా. అధిక వర్షాల ధాటికి మినుము మొక్క పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత వ్యవసాయ అధికారులు పంటనష్టం అంచనాలు రూపొందించినప్పుడు ఐదు ఎకరాల్లో నష్టపోయిన మినుము పంటను పరిశీలించారు. కానీ ఒక్క ఎకరాకే పరిహారం మంజూరు అయింది.

-చాకిరి కృష్ణమూర్తి, రైతు

కౌలురైతులకూ ఇవ్వాలి



పంట నష్టపరహారం చెల్లింపులో కౌలురైతుల పేర్లు నమోదు చేయాలి. అప్పు చేసి ఐదు ఎకరాల భూమి కౌలుకు తీసుకుని సాగు చేశాను. కానీ పంట నష్టపరిహారం జాబితాలో భూయాజమానుల పేర్లు నమోదు చేయటంతో నాకు పరిహారం దక్కలేదు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

- ఆలూరు సుబ్రహ్మణ్యం, కౌలురైతు

రూ.25 వేల పరిహారం ఇవ్వాలి



ప్రభుత్వం కేవలం రూ.10 వేలు పరిహారం చెల్లించటం దారుణం. ఒక్కో ఎకరాకు వరి రైతులు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఒక్కో ఎకరాకు రూ.12 వేలు ఖర్చు చేసి రైతులు కూరగాయలు సాగు చేస్తే వర్షాలకు మొక్కలు కొట్టుకుపోయాయి. కూరగాయలు, మినుము పంటకు ఎకరాకు రూ.12 వేలు, వరి పంటకు రూ.25 వేలు చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి.

-తోట సాంబశివరావు, రైతు సంఘం నాయకుడు

ఏఈగా బసవశాస్త్రులు



ఉయ్యూరు: బందరు రూరల్ పరిధిలోని చిన్నాపురం సెక్షన్ నుంచి బదిలీపై ఉయ్యూరు ఏఈగా బసవ శాస్త్రులు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ నాగమల్లేశ్వరరావు బదిలీపై వెళ్లటంతో ఆ స్థానంలో బసవ శాస్త్రులు నూతన ఏఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణంలో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. లో ఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది అప్రమత్తతతో ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగ్గా సరఫరా జరిగేలా చూస్తామన్నారు. రైతులకు నిరంతరాయంగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన బసవ శాస్త్రులు ఈఈ కృష్ణనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి ప్రాంతంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా పోరంకిలో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణగా బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, పోరంకి సెంటర్, ప్రభునగర్, బందరు రోడ్డు ప్రాంతల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్థానికులు సహకరిచాలని కోరారు.

నేటి నుంచి శిక్షణ

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యచరణ ప్రణాళిక 2024- 25లో భాగంగా ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టి.స్వర్ణలత ఆదివారం తెలిపారు. పంచాయతీల్లో సాధారణ పరిపాలన విధానం, ఏపీపీఆర్ చట్టం 1994లో నిబంధనలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, ఇరువురు వార్డు సభ్యులు హాజరుకావాలని తెలిపారు.


గాయత్రీ విహార్‌లో శుభ గణపతికి పూజలు చేస్తున్న భక్తులు


యాదవుల రామాలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు


కంకిపాడు ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో గాయత్రీదేవిగా వాసవీ మాత

దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా నాలుగో రోజు అమ్మవార్లను ఆలయాల్లో, ప్రత్యేక మండపాల్లో వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

-పెనమలూరు/గన్నవరం/కంకిపాడు/ఉయ్యూరు/విజయవాడరూరల్/రామవరప్పాడు


మంగళాపురం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో లలితాత్రిపుర సుందరీదేవిగా


రామవరప్పాడులో శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా పేరంటాలమ్మ


ఆత్కూరులో లలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు


యనమలకుదురులో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రసాద్


ఉయ్యూరు శివాలయంలో అలరించిన నృత్య ప్రదర్శన

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి

పెనమలూరు: రక్తదానం చేసి ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పెనమలూరు సీఐ జె.వెంకటరమణ అన్నారు. కానూరులో ఆదివారం మౌంట్ కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ రక్తందానం చేయటం వలన ప్రమాదంలో ఉన్న వారిని ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయటం వలన వారిలో సామాజిక సేవ కనబడుతుందని తెలిపారు. కాగా ఈ సందర్భంగా దాదాపు 40 మంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. బీపీ, సుగర్ హిమోగ్లోబిన్, బ్లెడ్ గ్రూప్, వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు.ఈ కార్యక్రమంలో ఫాదర్ సలివేంద్ర శౌరి, ఎస్ఐ ఉషారాణి, నెహ్రూ యువ కేంద్రం అధికారి సుంకర రాము, వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, తాళ్లూరి అశోక్‌శారద, క్రీడాకారులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి ఫాదర్ శౌరి ప్రశంసాపత్రాలు అందజేశారు.


కానూరులో రక్తదాతలతో సీఐ వెంకటరమణ, ఫాదర్ శౌరి

ముగిసిన క్లౌడ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్


శిక్షణ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు ఆదివారం జరిగింది. గత నాలుగు రోజులుగా కాలేజీలో 65 మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చామని అకడమిక్ డైరెక్టర్ ఎస్.కీర్తిరెడ్డి తెలియజేశారు. ఏ డబ్ల్యూఎస్ క్లౌడ్ ట్రైనర్ గోకుల్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రశాంత్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కిషోర్‌బాబు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి అశోక్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

- సరుకుల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద బాధితులకు చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్షయపాత్ర శ్రీనివాస్, మధురాంతకం శ్రీనివాసరావు ఆదివారం భవానీపురంలోఅందజేశారు.

బుడమేరుపై వంతెన నిర్మాణం ఎప్పుడో?

- వంతెనకోసం జక్కులనెక్కలం గ్రామస్తుల ఎదురు చూపు
- తూర్పున బుడమేరు, ఉత్తరం వైపు ఏలూరు కాలువ మధ్య గ్రామం

గన్నవరం రూరల్ : మండలంలోని జక్కులనెక్కలం గ్రామం వద్ద బుడమేరుపై వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నారు. ఈ గ్రామంలో వెయ్యి మంది జనాభా ఉన్నారు. విజయవాడ రూరల్ మండలం గూడవల్లి గ్రామం జాతీయ రహదారి నుంచి కిలో మీటరు దూరంలో ఈ గ్రామం ఉంది. జాతీయ రహదారికి దగ్గరలోనే బుడమేరు వెళుతుంది. ఈ బుడమేరు దాటి రోజూ రాకపోకలు కొనసాగిస్తారు. అయితే బుడమేరుపై ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారి వంతెన శిథిలావస్థకు చేరింది. బుడమేరు పొంగితే రాకపోకలు నిలిచిపోవాల్సిందే. ఇటీవల వరదలకు ఈ గ్రామానికి సంబంధాలు తెగిపోయాయి. దీంతో పడవలపై గ్రామంలోకి వెళ్లి అధికార యంత్రాంగం వారికి నిత్యావసరాలు అందించారు. గతంలో ఇదే పరిస్థితి పలుమార్లు సంభవించింది. ఈ రహదారి వెంట వరి, చెరకు వంటి పంటల ఆయకట్టు వందలాది ఎకరాల్లో ఉంది. నిత్యం రైతులు తమ పంట చేలల్లోకి వెళుతుంటారు.

బుడమేరు పొంగితే

అధిక వర్షాలకు బుడమేరు రహదారి వంతెనపై ప్రవహిస్తుంటుంది. కనీసం ఐదు అడుగులకు పైగా బుడమేరు వంతెనపై నీరు పొంగుతుంది. దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఇక్కడ వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు, నాయకులకు అర్జీలు అందజేశారు. తూర్పు వైపు బుడమేరు, ఉత్తరం వైపు ఏలూరు కాలువ ఉండగా, వాటి మధ్య ఈ గ్రామం ఉంది. వర్షాలు అధికంగా కురిసినప్పుడు గ్రామస్తులు బుడమేరు పొంగుతుందని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. శిథిలావస్థకు చేరిన రహదారి వంతెనపై ఎత్తుగా వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


జక్కులనెక్కలం వద్ద బుడమేరుపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం


ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి



ఇటీవల వరదలకు బుడమేరు పొంగి గ్రామం చుట్టూ నీరు చేరింది. వారం రోజులకు పైగా బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రస్తుతం బుడమేరుపై ఉన్న వంతెన మార్గం శిథిలావస్థకు చేరింది. ప్రభుత్వం వెంటనే వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

-మంగళాపూడి ప్రకాష్, గ్రామస్తుడు

వరదలకు గ్రామం అతలాకుతలం



బుడమేరుపై వంతెన నిర్మించాలని ఎంతో కాలంగా కోరుతున్నాం. ఇటీవల వరదలకు గ్రామం అతలాకుతలం అయ్యింది. ఎన్నో ఇక్కట్లు పడ్డాం. మా బాధలు అర్థం చేసుకోవాలి. వెంటనే చర్యలు తీసుకుని వంతెన నిర్మించాలి.

-ఎస్.భాస్కరరావు, గ్రామస్తుడు